క్లుప్తంగా

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న మేనేజర్ రాజేశ్వర్‌రావు

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు, ఎల్కపల్లి శాఖ మేనేజర్ రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో బుధవారం గ్రామస్తులకు, ఖాతాదారులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంకులో రైతులకు, మహిళలకు అందిస్తున్న రుణాలు, బీమా పథకాలపై వివరించారు. ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతా కలిగి ఉండాలని సూచించారు. ఖాతా వివరాలు, ఓటీపీ గోప్యంగా ఉంచుకోవాలన్నారు. సైబర్ నేరాలపై ఖాతాదారులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మేకల కమల, ఫీల్డ్ అధికారి గోపికృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

రికార్డులు నమోదు చేయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రకాశ్

కెరమెరి: రికార్డులు విధిగా నమోదు చేయాలని ఎంఎన్‌వో ఆడే ప్రకాశ్ అన్నారు. ఎఫ్ఎల్ఎన్‌లో భాగంగా బుధవారం మండలంలోని ఇందాపూర్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, తరగతి బోధన పరిశీలించారు. ఉపాధ్యాయులు బోధన చేసిన అంశాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. టీచింగ్ డైరీలు రాయాలని టీచర్లకు సూచించారు. సీఎం బ్రేక్‌ఫాస్ట్ అమలులో నిర్లక్ష్యం వహించకూడదన్నారు. హెచ్ఎం రజిత, టీచర్లు సురేశ్, అరుణ్, శిరీష ఉన్నారు.

24 నుంచి క్రికెట్ పోటీలు

కౌటాల: మండలంలోని ముత్తంపేట్ గ్రామంలో ఈ నెల 24వ తేదీ నుంచి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు నరేశ్, వెంకటేశ్, శేఖర్, లోహిత్ బుధవారం తెలిపారు. గ్రామ సమీపంలోని క్రీడా మైదానంలో జీపీ లెవల్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు 7989003032, 9553222755 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వాసవీ క్లబ్ కార్యవర్గం ఎన్నిక



వాసవీ క్లబ్ నూతన కార్యవర్గం

ఆసిఫాబాద్: వాసవీ క్లబ్ -2024 పట్టణ కార్యవర్గం బుధవారం జిల్లా కేంద్రంలోని వాసవీ మందిరంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొలిప్యాక శంకర్, కార్యదర్శిగా తాటిపెల్లి ఆదిత్య, కోశాధికారిగా చిలువేరి శ్రీధర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు ఎకిరాల శ్రీనివాస్, గంధం శ్రీనివాస్, చిలువేరి వెంకన్న, గుండ ప్రమోద్, తాటికొండ లక్ష్మయ్య, కొలిప్యాక వేణుగోపాల్, గోగుల శ్రీనివాస్, మార అజయ్ పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి మండలపూజ

మంచిర్యాలఅర్బన్: పాత మంచిర్యాల రామాలయం, శివాలయంలో బుధవారం అయ్యప్ప స్వామి మండలపూజ వైభవోపేతంగా జరిగింది. పూజ ప్రారంభానికి ముందు గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి దేవతామూర్తుల చిత్రపటాలతో నగర సంకీర్తన ద్వారా ఆలయానికి మేళతాళాలతో తీసుకొచ్చారు. కాలుబృందం చేసిన భక్తి పాటలు అలరించాయి.

కస్తూర్బాలో విజ్ఞాన ప్రయోగశాల

జన్నారం: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో డీఈఓ యాదయ్య ఆదేశాల మేరకు సైన్స్ అధికారి మధుబాబు పర్యవేక్షణలో బుధవారం విద్యార్థులకు విజ్ఞాన ప్రయోగశాల నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రసాయన శాస్త్ర ప్రయోగాలు, మానవ శరీర అంతర్గత అవయవాల పనితీరు విద్యార్థులకు వివరించారు.

22న మండల సర్వసభ్య సమావేశం

నార్నూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కనక మోతుబాయి అధ్యక్షతన ఈనెల 22న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమేశ్ బుధవారం తెలిపారు. సమావేశానికి జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎమ్మెల్యే కోవ లక్ష్మిలు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

ముందుకు సాగని పనులు

దహెగాం మండలంలోని కుంచవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మన ఊరు మన బడి కింద రూ.14 లక్షలతో నిర్మిస్తున్న డైనింగ్ హాల్ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. నిర్మాణం ప్రారంభించి నెలలు కావస్తున్నా ఇప్పటికీ పూర్తి కాలేదు. డైనింగ్ హాల్ పైకప్పు రేకులు వేశారు. ప్లాస్టింగ్, గచ్చు పనులు మిగిలి ఉన్నాయి.



- 'మన ఊరు మన బడి'లో 19 పాఠశాలలు ఎంపిక
- నిలిచిపోయిన పనులు
- పట్టించుకోని అధికారులు



ఈ నిర్మాణం దహెగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 'మన ఊరు –మన బడి' కింద రూ.14 లక్షలతో చేపట్టిన డైనింగ్ హాల్. హాల్ నిర్మాణం పనులు నిలిచిపోయి నెలలు గడుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. పనులు ఎన్నడు పూర్తి చేస్తారో వేచి చూడాల్సిన పరిస్థితి ఉంది.



మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో 'మన ఊరు –మన బడి' కింద అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం ఏడాది క్రితం పనులు ప్రారంభించినా ఇంకా పునాది దశలోనే ఉన్నాయి. కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు ఆపేశారు. బిల్లులు రాని కారణంగా పనులు ముందుకు సాగడం లేదు.

దహెగాం: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు విద్యాప్రమాణాలు మెరుగుపర్చడానికి గత ప్రభుత్వం మన ఊరు –మన బడి కార్యక్రమం ప్రవేశపెట్టింది. మన ఊరు మన బడి కింద మండలంలో 19 పాఠశాలలను ఎంపిక చేసి పనులు కూడా ప్రారంభించారు. పనులు ప్రారంభించడమే తప్పా పనుల్లో పురోగతి లేదు. విద్యా సంవత్సరం ప్రారంభం వరకు పనులు పూర్తి చేస్తామని అధికారులు రివ్యూ మీటింగ్‌లలో తెలియజేశారు. కానీ ఈ విద్యాసంవత్సరం ప్రారంభమై ఏడు నెలలు కావస్తున్నా పనులు మాత్రం పూర్తికాలేదు. కొన్నిచోట్ల పనులు నిలిచిపోయాయి. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

మండలంలో 19 పాఠశాలలు ఎంపిక..

మన ఊరు మన బడి కింద మండలంలో 19 పాఠశాలలను ఎంపిక చేశారు. అన్ని పాఠశాలల్లో పనులు ప్రారంభించారు. దహెగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, కుంచవెల్లిలో రెండు, రాళ్లగూడ, బీబ్రాలో రెండు, చౌక, ఇట్యాల, కల్వాడ, హత్తిని, మొట్లగూడ, ఐనం, బొగుడగూడ, అమరగొండ, చంద్రపల్లి, చినరాస్పెల్లి పాఠశాలలను ఎంపిక చేశారు. మొదట్లో పనులు వేగవంతంగా సాగగా బిల్లులు విడుదల కాకపోవడంతో పనులు మందగించాయి. చంద్రపల్లి, బీబ్రా ప్రాథమిక పాఠశాలల్లో పనులు పూర్తి చేశారు. బీబ్రా ప్రాథమిక పాఠశాలలో ప్రారంభోత్సవం కూడా జరిగింది. మిగతా పాఠశాలలు చినరాస్పెల్లి, హత్తిని, బొగుడగూడ, కల్వాడ పాఠశాలల్లో పనులు చివరి దశకు చేరాయని అధికారులు పేర్కొంటున్నారు. మిగతా చోట్ల పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చొరవ తీసుకొని పనులు పూర్తయ్యేలా చూడాలని కోరుతున్నారు.

రూ. 5.90 కోట్లతో పనులు..

మన ఊరు మన బడి కింద 19 పాఠశాలలకు గాను సమగ్రశిక్ష కింద రూ. 2.90 కోట్లు, ఈజీఎస్ కింద రూ.3 కోట్లు వెచ్చించారు. అందులో ఇప్పటి వరకు సుమారు రూ.1.60 కోట్ల పనులు పూర్తయినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం..

మన ఊరు మన బడి కింద మండలంలో 19 పాఠశాలలను ఎంపిక చేశాం. అన్ని పాఠశాలల్లో పనులు ప్రారంభించాం. నిలిచిపోయిన పనులు ముందుకు సాగడం లేదన్న విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. కొన్ని పాఠశాలల్లో పనులు చివరి దశకు చేరాయి. మిగతా చోట్ల కూడా పూర్తి చేస్తాం.

– భిక్షపతి, ఇన్‌చార్జి ఎంఈవో

'టీబీజీకేఎస్ గెలిస్తే కార్మికులకు స్థలం'



గోలేటి డిస్పెన్సరీలో మాట్లాడుతున్న ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్ రావు

రెబ్బెన: ఈనెల 27న జరగనున్న సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో టీబీజీకేఎస్ గెలిస్తే కార్మికులకు రెండు గుంటల చొప్పున స్థలం ఇప్పిస్తామని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్ రావు అన్నారు. బుధవారం ఏరియా వర్క్‌షాప్, జీఎం కార్యాలయం, గోలేటి డిస్పెన్సరీలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీబీజీకేఎస్‌ను మరోసారి గుర్తింపు సంఘంగా ఆదరిస్తే కార్మికులకు ఇన్‌కం ట్యాక్స్ రికవరీ డబ్బులను తిరిగి ఇప్పించటంతో పాటు గృహ నిర్మాణానికి అందించే రుణాలను రూ. 30లక్షలకు పెంచి వడ్డీ మాఫీ చేయిస్తామన్నారు. వారసత్వ ఉద్యోగాలను కార్మికులకు దూరం చేసిన చరిత్ర జాతీయ సంఘాలదని తెలిపారు. కార్మికుల కోసం పరితపించే టీబీజీకేఎస్‌కు మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. సమావేశాల్లో సెంట్రల్ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రకాశ్‌రావు, మాజీ ఉపాధ్యక్షుడు సదాశివ్, చర్చల ప్రతినిధి మంగీలాల్, జీఎం కమిటీ నాయకులు సమ్మయ్య, చంద్రశేఖర్, వెంకటేష్, ఏరియా అసిస్టెంట్ కార్యదర్శి కుమారస్వామి, నాయకులు రాజేశం, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కోల్‌ఇండియా ఒప్పందాలు సింగరేణిలో అమలు చేయిస్తాం



గోలేటి సీహెచ్‌పీలో మాట్లాడుతున్న ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు

రెబ్బెన: హెచ్ఎంఎస్‌ను గెలిపిస్తే కోల్ ఇండియాలో జరిగే ఒప్పందాలను సింగరేణిలో అమలు జరిగేలా చూస్తామని హెచ్ఎంఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు అన్నారు. బుధవారం గోలేటి సీహెచ్‌పీలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మిక హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న హెచ్ఎంఎస్‌ను గెలిపిస్తే బొగ్గు గని కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందాలు, ప్రమోషన్ పాలసీలు, అలవెన్సులపై ఆదాయపు పన్ను రీఎంబర్స్‌మెంట్ కల్పిస్తామన్నారు. కార్మిక సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే కార్మికుల పిల్లలకు మెరుగైన విద్య అందించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. కోల్ ఇండియాలో బొగ్గు గని కార్మికులకు వర్తిస్తున్న ప్రతీ ఒప్పందాన్ని సింగరేణిలో కూడా అమలు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్పొరేట్ మెడికల్ బోర్డును ప్రక్షాళన చేసి గతంలో ఉన్న 1980 సర్క్యులర్ ప్రకారం వారసత్వ ఉద్యోగాల కొనసాగింపునకు కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో ఏరియా ఆర్గనైజర్ మరిశెట్టి దత్తు, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి కిష్టస్వామి, షిఫ్ట్ ఇన్‌చార్జి రాజు, ఆర్గనైజర్స్ ఓంకార్, సాహిత్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కౌటాల: హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న చింతలమానెపల్లి మండలం బాలాజీ అనుకోడ గ్రామానికి చెందిన జునుగరి శంకర్‌ను బుధవారం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యాన్ని అందించాలని వైద్యులను కోరారు.

నిమ్స్ డైరెక్టర్‌ను సన్మానించిన ఎమ్మెల్యే

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ఎన్.బీరప్పను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు.

31లోపు బ్యాగ్ ఫిల్లింగ్ పూర్తి చేయాలి



కొనసాగుతున్న సమీక్షా సమావేశం

కెరమెరి: ఈ నెల 31 లోపు ఉపాధి హామీ నర్సరీల్లో కొనసాగుతున్న బ్యాగ్ ఫిల్లింగ్ పనులు పూర్తి చేయాలని ఎంపీడీవో మహేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ పథకంపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. బ్యాగుల్లో మట్టి నింపడం పూర్తయిన వెంటనే విత్తనాలు పెట్టాలన్నారు. ప్రతీ గ్రామ పంచాయతీ నుంచి సుమారు 50 మంది కూలీలు ప్రతిరోజు పని చేసేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 106 మంది లబ్ధిదారులకు మరుగుదొడ్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. జాబ్ కార్డులు, బ్యాంకు ఖాతాలను సరి చూడాలని తెలిపారు. గ్రామస్థాయిలో పారిశుద్ధ్యంపై శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఈసీ ఐక్యనాయక్, గ్రామ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు ఉన్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

నార్నూర్: ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు ఫెరోజ్ ఖాన్ డిమాండ్ చేశారు. బుధవారం డివిజన్ స్థాయిలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆటోలు బంద్ నిర్వహించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం సంతోషంగా ఉందన్నారు. ఈ పథకంతో ఆటో డ్రైవర్లు జీవనోపాధి కోల్పోవాల్సి వస్తుందన్నారు. ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త రాథోడ్ సకారం, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

కూపర్ లింగుస్వామికి పూజలు

కాసిపేట: మండలంలోని వెంకటాపూర్ గ్రామ పంచాయతీ కుర్రేగాడ్ గ్రామంలో బుధవారం నుంచి శ్రీశ్రీపాహుండి కూపర్ లింగుస్వామి, భీమన్న దేవుడి సట్టి పూజలు ప్రారంభమయ్యాయి. ఈ పూజలు నాలుగు రోజుల పాటు కొనసాగుతాయని పూజారులు తెలిపారు. ఆదివాసీ సంస్కృతి, వాయిద్యాలతో దేవుడిని ఊరేగించి సాయంత్రం పూజ చేసి కాలినడకన గంగకు బయలుదేరుతారు. అక్కడ స్నానం చేసి సంప్రదాయాలతో పూజలు చేసి తిరిగి ఇంటికి చేరుకొని భీమన్న దేవుడికి పూజలు చేస్తారు. కార్యక్రమాల్లో గ్రామస్తులు కుర్సింగ భూదేవ్‌స్వామి, మాదవ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గురు చరిత్ర పారాయణం ప్రారంభం

చెన్నూర్: పట్టణంలోని శివాలయంలో లోక కళ్యాణార్థం బుధవారం గురు చరిత్ర పారాయణాన్ని అర్చకులు వేమారం మహేశ్వర్ శర్మ ప్రారంభించారు. పారాయణ ప్రవచనలకు పెద్ద సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. ఏటా శివాలయంలో గురుచరిత్ర పారాయణ ప్రవచనాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పారాయణం ఈ నెల 26 మంగళవారం ముగుస్తుందన్నారు. 27న బుధవారం 10గంటలకు వ్యాస పూజ, మధ్యాహ్నం 1గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గురు చరణ్ శర్మ పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లు సద్వినియోగం చేసుకోవాలి

దండేపల్లి: మండలంలోని కన్నెపల్లి సమీపంలోని శ్రీ వెంకటేశ్వర జిన్నింగ్ మిల్లులో సీసీఐ ద్వారా చేపడుతున్న పత్తి కొనుగోళ్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొద్ది రోజులుగా పత్తి కొనుగోళ్లు నిలిచిపోయి, రైతులు ఇబ్బంది పడటంతో, సీసీఐ సీపీవో ఉదయ్‌షాతో మాట్లాడి, పత్తి కొనుగోళ్లు చేపట్టాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. గురువారం నుంచి కొనుగోళ్లు ప్రారంభమవుతాయని చెప్పారు.

చివరికి నిరాశే..!

- వర్షాభావంతో తగ్గిన దిగుబడి
- ఏటా నష్టాలు చూస్తున్న వరి రైతులు
- జిల్లాలో 57,306 ఎకరాల్లో సాగు



గురుడుపేటలో యంత్రం సాయంతో వరి పంట పడుతున్న రైతులు

కౌటాల: ప్రకృతి రైతాంగాన్ని పగబట్టింది. ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావం, తెగుళ్లు రైతులను కుదేలు చేశాయి. రైతులు వరిలో సన్న రకం అధిక మొత్తంలో సాగు చేశారు. కానీ పంటలకు సోకిన తెగుళ్లు, పెరిగిన కలుపు, దళారుల దోపిడీ వెరసి వరి రైతులు చిత్తవుతున్నారు. అధిక పెట్టుబడులతో పంట సాగు చేస్తే తెగుళ్ల బారిన పడి పంటలో దిగుబడి చాలా వరకు తగ్గుతోందని, చివరికి నిరాశే మిగులుతోందని రైతులు వాపోతున్నారు.

57,306 ఎకరాల్లో సాగు..

జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో 57,306 ఎకరాల్లో వరి పంట సాగు చేయగా 25 నుంచి 30 శాతం వరకు పంట దిగుబడి తగ్గింది. బహిరంగ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు సాగు చేయాలని అధికారులు సూచించినా రైతులు వరి సాగువైపే ఆసక్తి చూపారు. కానీ వరి పంటకు తెగుళ్లు సోకి ప్రస్తుతం వరి దిగుబడి తగ్గిపోయింది. దీంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల వరి కోతలు పూర్తి కావడంతో గత కొద్ది రోజుల నుంచి రైతులు వరి పంటలను కెశార్‌లతో పడుతున్నారు. కొంత మంది రైతులు వరి పంటను వ్యవసాయ ఎద్దులతో బంతి కడుతున్నారు.

అనావృష్టి.. తెగుళ్లు

రైతులు ఏటా అతివృష్టి లేదా అనావృష్టి కారణంగా నష్టపోతున్నారు. ఖరీఫ్ ఆరంభంలో వర్షాలు ఆలస్యంగా కురవడంతో ఈ సారి పత్తితో పాటు వరి పంటను సైతం రైతులు ఆలస్యంగా సాగు చేశారు. అనంతరం కురిసిన వర్షాలకు పంటలు కళకళలాడటంతో అన్నదాతలు దిగుబడులపై ఆశలు పెంచుకున్నారు. కానీ సకాలంలో వర్షాలు లేక దిగుబడిపై ప్రభావం పడింది. వరి పొట్ట దశలో ఉన్నప్పుడు వర్షాలు కురవలేదు. దీనికి తోడు వరి పంటకు దోమ, పచ్చపురుగు, చిలుక పురుగు ఆశించి తీవ్ర నష్టాన్ని కలుగజేశాయి. పంటకు ఆశించిన పురుగులను నాశనం చేయటానికి రెండుసార్లు అధికంగా మందులు పిచికారీ చేశారు. వ్యవసాయ బావుల ఆధారంగా కొంత మంది రైతులు సాగునీరు అందించగా, వర్షధారంపై ఆధారపడిన రైతుల వరి పొలాలు ఎండిపోయాయి. మరోవైపు వరి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.5 వేల మద్దతు ధర ప్రకటించాలని కోరుతున్నారు.

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వరి పంట సాగు వివరాలు..

మండలం	ఎకరాలు
ఆసిఫాబాద్	1,738
రెబ్బెన	6,161
తిర్యాణి	1,394
వాంకిడి	371
కాగజ్‌నగర్	7,827
కౌటాల	7,779
సిర్పూర్(టి	5,343
బెజ్జూర్	7,129
చింతలమానెపల్లి	4,205
దహెగాం	9,072
పెంచికల్‌పేట్	4,911
జైనూర్	89
లింగాపూర్	990
సిర్పూర్(యూ)	297
మొత్తం	57,306

పంట దిగుబడి తగ్గింది



ఈసారి మూడు ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. సుమారు రూ. 70వేల వరకు పెట్టుబడి పెట్టాను. సకాలంలో వర్షాలు లేక పంటకు చాలా రకాల తెగుళ్లు సోకాయి. గతంలో ఎకరాకు 40 బస్తాలు వచ్చేవి. ఇప్పుడు 20 బస్తాలు వచ్చేది గగనమే. చేతిలో డబ్బు లేక అప్పులు చేసి పంట సాగు చేశాను.

– కె. సూర్యదాస్, యాపలగూడ

మద్దతు ధర పెంచాలి



నేను రెండెకరాల్లో వరి పంట సాగు చేశాను. సాధారణంగా ఎకరాకు రూ. 18వేల నుంచి రూ. 20వేల వరకు పెట్టుబడి పెట్టేవాన్ని. ఈ సారి వర్షాభావం కారణంగా అదనంగా ఎకరాకు రూ. 5వేల వరకు ఖర్చు చేశాను. కానీ పంటకు తెగుళ్లు సోకడంతో ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రాలేదు. దీంతో ఆర్థికంగా నష్టపోతున్నాం.

– ఎ.సత్తయ్య, రైతు, తలోడి

భక్తిశ్రద్ధలతో పూజలు



శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న దేవాలయంలో బుధవారం బోనాలు సమర్పించారు. సట్టి బోనాల సందర్భంగా నియమనిష్ఠలతో మొక్కులు చెల్లించుకున్నారు. శివమల్లన్న ఆలయం ఆవరణలో ఆదివారంతో పాటు బుధవారం కూడా బోనాలు పోసి భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. ఆలయంలోని శివలింగంతో పాటు నందీశ్వరుడు, ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ అధికారులు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకున్నారు.



క్యూలో భక్తులు